# ఉన్మాదంలోకి...

సుచిత్రకు పొద్దున మెలకువ రాలేదు. రాత్రి ఆలస్యంగా నిద్ర. ఇంకా నిద్రపోవాలని... అలసట! మత్తు! కాని నిద్ర మెలకువ మధ్య పాప ఏడ్పు! ఒక్కటే ఏడ్పు. కీ.కీ... అని చెవుల్లో మోత. పాపం పాప! ఆకలి! లేవాలె. లేచి పాలు తాగించాలె.

సుచిత్రకి లేచే శక్తి లేదు. అలసట! మత్తు! రాత్రి సుచిత్ర ఎన్నిసార్లు లేచిందో - ఓసారి పాప ఆకలి ఏడ్పు. లేచి రొమ్ము పాప నోటికందించింది. పాప పాలు చీకి చీకి ఎపుడు పడుకుందో సుచిత్రకు తెలియదు. మరోసారి ఉచ్చతో గుడ్డ తడిసి ఏడిస్తే సుచిత్ర లేచింది. అట్లా గంట గంటకు లేవటమే! సుచిత్రకు నిద్ర సరిపోలేదు. కళ్లు మూసుకుపోతున్నాయి! భారంగా బరువుగా, మెదడులో ఏవో మెలికలు, కడుపులో పైత్యపు సుడిగుండాలు! ఒళ్ళంతా ఊగిపోతున్నది! అయినా లేవాలె. పాపకు పాలు పట్టాలె!...

సుచిత్ర యంత్రంలాగా లేచింది. జాకెట్ హుక్ తీసే ఉంది. చన్నుమొనను పాప నోట్లోకి కుక్కింది. చుప్పు చుప్పుమని పాప ఆత్రంగా చప్పరించింది. పాలు నోట్లోకి రాలేదేమో.. చన్నుమొనను లాగింది... లేత చిగుళ్లతో కొరికింది. అబ్బ!... సుచిత్రకు భరించలేని నొప్పి!

రాత్రంతా పాప పాలు చీకింది. ఎక్కడుంటాయి పాలు! సుచిత్రకు తిండీ తిప్పలు సరిగ్గా లేవు! ఇంటి పనులు, పాప పనులు, ఆఫీసు పనులు టెన్షన్, వర్రీ! పాలు ఎట్లా వుంటాయి! ఎంతగనం వుంటాయి. డాక్టరు మాటలు మెదడులో ప్రతిధ్వనించాయి - సరిగ్గా వేళకు తినాలమ్మా! బ్యాలెన్స్‌డ్ డయట్ తీసుకోవాలె! చదువుకున్నవాళ్ళే ఇట్లా నిర్లక్ష్యం చేస్తే ఎట్లా!... కోపం, అనునయం కలిసిన మాటలు!

కీ! కీ!... పాప ఏడ్పు మళ్ళా. సుచిత్రకు అలసట, మత్తు. లేవాలె. ఫ్రిజ్‌లో పాలు తీసి వెచ్చజేసి బాటిల్లో పోయాలె. పాపకు తాగించాలె!... పాపం! పాపకు ఆకలి. రాత్రి దానికి పాలు సరిపోలేదేమో! అందుకే మళ్ళీ మళ్ళీ గుణిసింది! ఏడ్చింది! ఆకలి! ఆకలి! పాపం! అసలు మనిషికి మొదటి ఇన్‌స్టింక్ట్ ఆకలేనేమో! పుట్టగానే నోరు పక్కకు తిప్పుతూ ఏడ్పు ఆకలితోనేమో! గంట గంటకు ఆకలి! ఘడి ఘడీకి ఆకలి!

ఆకలి!... తనకూ ఆకలిగా వుంది! రాత్రి ఒంటరిగా ఏం వండుకోబుద్ధి కాలేదు. తినబుద్ధి కాలేదు. పొద్దున వండిన అన్నమే వుంటే పెరుగు వేసుకొని తిన్నది. సరిపోలేదేమో లేవగానే ఐదింటికే ఆకలి! డొక్క లోపలికి ఈడ్చుకపోయింది. పాప కయ్యికయ్యిమన్న ఏడ్పుకు సుచిత్ర ఉలిక్కిపడింది. ముందుగాల పాపకు పాలు తాపాలే!...బరువుగా లేచింది. ఫ్రిజ్‌లోంచి పాలు తీసి వెచ్చచేసింది. బాటిల్ కోసం చూసింది. బాటిల్ మురికిగా వుంది. నిట్టూర్చింది సుచిత్ర! నిన్న బాటిల్ కడిగే టైమ్ లేదు. మెల్లగా బాటిల్ తీసుకొని వేడినీళ్ళతో కడిగింది. పాలు బాటిల్లో పోసింది. బెడ్‌రూమ్‌లో పాప ఒకటే ఏడ్పు. దాన్ని ఎత్తుకునే వాళ్లు, ఓదార్చేవాళ్లు లేరు. గుక్కపట్టి ఏడ్పు. సుచిత్ర ఉరుక్కుంటూ పోయి పాపనెత్తుకుంది. పాల సీసాను నోట్లో కుక్కింది. పాప ఆత్రంగా పాలు తాగింది. ఆత్రంలో పాపకు సరం తప్పింది. సుచిత్ర పాలసీసాను కొంచెం కిందికి దించి పాప చాతి మీద నిమిరింది. పాపవైపు చిరునవ్వుతో చూసింది...

పాప పుట్టగానే అత్తగారు, మామగారు వచ్చారు. మూతి ఇటు, ముక్కు అటు పెట్టారు.

"నాకు తొల్చూరు కొడుకు పుట్టిండు. గీ ఆడపిల్లల సాలు మాది కాదు" పుల్లవిరిచినట్లుగా అత్తగారి మాటలు. సుచిత్రకు బయటికి రాని కళ్ల నీళ్ళతో గుండె బరువెక్కింది. అత్తమామల వెనుక నుంచి రాజు చిర్రుబుర్రులు–

"నేను ఆఫీసుకు పోవాలె. ఈ రోజు కొరియానుంచి డెలిగేట్స్ వస్తున్నారు. ఐమస్ట్ బీ దేర్".

తెల్లవారగట్లనే డెలివరీ అయింది. రాత్రంతా నొప్పుల బాధ! మూలుగులు! ఇంజక్షన్లు, మందులు! పొద్దు పొడవక ముందే పాప బయటపడింది. పొద్దు పొడిచాక రాజు వచ్చాడు. అతని వెంట అత్తమామలు. "అమ్మ నాన్నలను తేవటానికి స్టేషన్‌కు పోయిన. నీ డెలివరీకి ముందల రాలేకపోయిండ్రు" అన్నాడు.

అంతే, వెంటనే అత్తగారి పుల్లవిరుపు మాటలు!

"నీళ్లాట అల్కగనే అయింది కద. ఇల్లు గొడ్డు గోడ ఎవసం ఇడిచిపెట్టి ఇక్కడ ఉంటె ఎట్ల!" అని వెంటనే అత్త మామలు తిరుగు ప్రయాణం కట్టారు. రాజు వాళ్లను రైలెక్కించి ఆఫీసుకు వెళ్ళిపోయాడు. దవాఖానాలో అర్రలో పాపతో సుచిత్ర ఒక్కతె! అప్పుడప్పుడు వచ్చి పోయే నర్సులు ఆయాలు అంతే!... అదంతా మెదడులో గిర్రున తిరిగి సుచిత్రకు మనస్సు ఎట్లనో అయింది. మెదడులో ఏవేవో ఆలోచనలు... జ్ఞాపకాలు.. పరిగెత్తాయి.

తనకు తొలి కాన్పు! ఏం అనుభవంలేదు. నీళ్ళాటలు... చిన్న పాపలను చూసిన అనుభవం లేదు. అంతా కొత్త! బిడ్డ కావాలని ఇద్దరూ మాట్లాడుకొనే నిశ్చయించుకున్నారు. దాంతో సుచిత్ర పిల్స్ తీసుకోవటం మానేసింది. గర్భవతి అయినంక డాక్టరు విశ్రాంతి అవసరం అనేంత వరకు సుచిత్ర ఆఫీసుకు పోతూనే ఉంది. లీవ్ పెడ్దామంటే వీలుకాలేదు. ఆఫీసులో అంతా అమెరికన్ కల్చర్! లీవ్ ఈజ్ ఇంపాజిబుల్ – అన్నాడు బాస్ చిరునవ్వుతో. సుచిత్ర కోపంతో పండ్లు నూరుకుంది. లోలోపల్నె. విధిలేక ఉద్యోగానికి రాజీనామా చేసింది.

సుచిత్ర, రాజు ఎమ్.బి.ఏ.లో క్లాసుమేట్స్. గోల్డన్ కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో సీటు వచ్చిందని సుచిత్ర చాలా సంతోషించింది. ఆ కాలేజీలో సీటు రావటమే గొప్ప! ఇక తన భవిష్యత్తంతా భద్రమే అనుకుంది. నిశ్చింత భావం కలిగింది. ఆమె ఆరేళ్ల వయస్సులోనే తలిదండ్రులు కారు యాక్సిడెంట్‌లో చనిపోయారు. తండ్రి కాంట్రాక్టరు. బ్యాంకు లోనులు, ఆ లోనులు, ఈ లోనులు అని లెక్కలు అయినంక సుచిత్ర పేరు మీద కొంత బ్యాంకు బ్యాలెన్స్ మిగిలింది. అమ్మమ్మ తన బాధ్యత తీసుకుంది. మేన మామలు – పెద్ద మామయ్య, చిన్న మామయ్య – వాళ్ళ సంసారాలు, పిల్లలు, వ్యాపారాలు వాటిల్లోనే తీరిక లేకుండా మునిగిపోయేవాళ్ళు. తనంటే ఉదాసీనంగానే ఉండేవాళ్ళు. అమ్మమ్మ చనిపోయేనాటికి సుచిత్ర ఇంటర్‌లో ఉంది. అప్పటికి తన బాధ్యతలు తను చూసుకోవటం నేర్చుకుంది. స్వతంత్రంగా నిలబడటం నేర్చుకుంది. అమ్మమ్మ పోయింతర్వాత హాస్టల్లో ఉంటూ డిగ్రీ చేసింది. డిగ్రీ తర్వాత ఎమ్.బి.ఏ.లో జాయినయింది. అక్కడే సుచిత్రకు రాజు పరిచయమయ్యాడు. రాజు తెలివైన విద్యార్థి. పల్లెటూరి వాతావరణంలో పెరిగి అక్కడే డిగ్రీ చేసి వచ్చాడు. పట్టణ వాతావరణం, కాలేజీలోని అల్ట్రా మోడర్న్ విద్యార్థుల శైలి అన్నీ అతనికి కొత్త. సుచిత్రతో పరిచయమయ్యాక రాజు సుచిత్ర వెంటనే ఉండేవాడు, తిరిగేవాడు. ఆమెతో కలిసి ప్రాజెక్టు పనులు చేసేవాడు. చాలా విషయాల్లో రాజు సుచిత్ర మీద ఆధారపడే వాడు. దాంతో ఒంటరి అయిన సుచిత్రకు ఒక స్నేహితుడు, అప్పుడు దొరికినట్టుగా అనిపించింది. ఆ స్నేహం ఫైనలియర్ వచ్చేసరికి ప్రేమగా మారింది. కాలేజీ చదువు అయిపోయే దశలో ఇద్దరూ తమ ప్రేమ గురించి తెలుసుకున్నారు.

"ఐ లవ్ యూ సుచ్చీ!" అన్నాడో రోజు రాజు. సుచిత్ర క్షణం ఆలోచనలో పడిపోయింది.

"రాజు మంచి వాడే. స్నేహశీలి!" అనుకుంది.

"ఐ లవ్ యూ టూ!" అంది అంతే! ఇద్దరి అనుబంధం మొదలైంది. క్యాంపస్‌లో జరిగిన ఇంటర్వ్యూలో ఒక్క ఊర్లోనే ఇద్దరికీ చెరో కంపెనీలో ఉద్యోగాలు వచ్చాయి.

సుచిత్రకు మంచి కంపెనీలో, మంచి జీతంతో ఉద్యోగం వచ్చింది.

"నా ఉద్యోగం కన్నా నీ ఉద్యోగం బెటర్ సుచ్చీ!" అంటున్నపుడు రాజు ముఖం మీద చిరునవ్వు కనిపించింది. కాని ఆ చిరునవ్వు వెనుక మనస్సులో పుట్టి కండ్లల్లో ప్రతిఫలించిన న్యూనతా భావం, దానివల్ల కలిగిన ఈర్ష్యను సుచిత్ర పసిగట్టలేక పోయింది.

"మన ఇద్దరి జీతాలతో మనం హాయిగా బతకొచ్చు" అన్నాడు రాజు మళ్ళా.

పెండ్లి కాంగానే ఇద్దరు ఒక పోష్ ఫ్లాటును కిరాయికి తీసుకున్నారు. లోన్ తీసుకొని కారు కొనుక్కున్నారు. రాజు రోజూ సుచిత్రను ఆఫీసులో విడిచిపెట్టి తను ఆఫీసుకు వెళ్ళేవాడు.

"నేనూ కారు కొనుక్కుంటాను. బ్యాంకు వాళ్ళు పిల్చి పిల్చి లోన్లు ఇస్తున్నారు కదా!" అంది సుచిత్ర ఓ రోజు.

"ఏం నా కారులో రావటం ఇష్టం లేదా!" నవ్వాడు రాజు. కాని అతని హృదయంలో ఎక్కడో సుచిత్ర ఆత్మవిశ్వాసం, స్వేచ్ఛ చిచ్చుపెట్టి మంటలను లేపాయి.

రాను రాను రాజు పనిలో బాగా మునిగిపోవటం మొదలైంది. అతడు సిన్సియారిటీని చూసి వెంటవెంటనే ప్రమోషన్స్ ఇచ్చారు. అప్పుడే రాజు అన్నాడు - "మనం ఇద్దరం! మనకో బిడ్డ వుంటే బాగుంటుంది" అని.

సుచిత్ర వెంటనే ఒప్పుకుంది. ఆమెకూ కొన్ని రోజులనుంచి అదే కోరిక మనస్సులో మెదులుతోంది. ఆ బరువు బాధ్యతకు రాజు ఏమంటాడో ఏమో అని జంకింది. ఇద్దరి మధ్య బంధం, రాగమయబంధం బిడ్డే! అనుకుంది. కాని బిడ్డను కనటం, పెంచటం ఇంత కష్టమనుకోలేదు. రాజు వున్నాడు కదా! - ఇద్దరం కలిసి మ్యానేజ్ చేస్తామనుకుంది. తనకు సాయంగా వచ్చి వుండటానికి ఎవరూ లేరు. రాజు తల్లిదండ్రులున్నా పల్లెటూరును, వ్యవసాయం పనులను విడిచిపెట్టి ఇక్కడ ఉండలేరు. "అయినా వాళ్ళను పని మనుషుల్లాగా వాడుకోవటం నాకిష్టం లేదు"- రాజు కచ్చితమైన అభిప్రాయం అది. అతనికీ మధ్య కోపం, చిరాకు ఎక్కువవుతున్నాయి. ఇంతకు ముందు ప్రతి దానికి సుచిత్ర అభిప్రాయం అడిగి ప్రజాస్వామ్యంగా ప్రవర్తించే రాజు ఏకపక్ష నిర్ణయాలే తీసుకుంటున్నాడు! "పాప మూన్నెళ్ళదయింది. ఇంట్లో ఉట్టిగానే కూర్చోకుండా ఏదైనా ఉద్యోగంలో జాయిన్ కారాదు. ఒక్క జీతంతో ఫ్లాటు కిరాయి, కారు లోను పే చెయ్యటం, కారు ఖర్చులు, ఇంటి ఖర్చులు, పాప ఖర్చులు అయ్యేట్లు లేవు" అన్నాడో రోజు రాజు.

అతని ఒక్కొక్క మాట వెనుకున్న అసహనాన్ని. కోపాన్ని సుచిత్ర చూడలేకపోయింది. కాని రాజు మాటలు వినగానే.

'అరె! అప్పుడే ఉద్యోగమా? పాపకు మూడో నెల! ఎవరు చూసుకుంటారు పాపను! అనుకుంది. కాని వెంటనే 'రాజు అన్నది నిజమే! ఖర్చులే కాదు; తనకూ ఇంట్లో కూర్చుని కూర్చుని బోర్ కొడుతోంది. మెదడు మొద్దుబారి పోతోందనిపిస్తోంది!' నవ్వుకుంది సుచిత్ర. పత్రికల్లో ప్రకటనలు చూసింది. నెట్‌లో వెతికింది. ఆమె క్వాలిఫికేషన్స్‌కు, అనుభవానికి తగిన ఉద్యోగం కాకున్నా జాయినయింది. కొంతయినా తన సృజనాత్మకతకు పరీక్ష పెట్టే ఉద్యోగం అన్న తృప్తితో వెళ్ళింది.

రాజు ఇప్పుడు ఆఫీసుకు చాలా తొందరగా వెళ్ళిపోతున్నాడు. దాంతో సుచిత్ర తన కారులో పోయి పాపను క్రష్‌లో వదిలేసి వచ్చేప్పుడు తెచ్చుకుంటోంది. పాపను క్రష్‌లో వదలాలంటే పాపకోసం పాలు, 'డయపర్సు', కాగబెట్టి చల్లార్చిన మంచినీళ్ళు అన్నీ సర్దుకోవాలె. పాప స్నానం కావాలె. ఫ్యారెక్స్ తినిపించాలె. రాజు ఏ పనిలో సాయం చేయడు! రాజుకు పొద్దున లేచి ఎకనామిక్ టైమ్స్, బిజినెస్ హెరాల్డ్ తిరగెయ్యడానికే టైమ్ ఉండదు. స్నానం, బట్టలేసుకోవటం, బ్రేక్‌ఫాస్ట్ అన్నిటికీ సుచిత్ర వెంట ఉండాలె. ఆమె కన్పించకపోతే చిర్రుబుర్రులాడుతాడు. రాజు ఆఫీసుకు పోయింతర్వాత ఇంట్లో తుఫాను వచ్చి ఆగినట్లుగా ఉంటుంది. రాజు ఇంతగా సెల్ఫ్ సెంటర్డ్ అవుతాడని ఆమె అనుకోలేదు. రాజు వెళ్ళిపోయిం తర్వాత సుచిత్ర పాపకు స్నానం వగైరా కానిచ్చి తను తయారవుతుంది. ఫ్లాటు లిఫ్టులో నుంచి పాపతో, పాప సామానుతో, తన బ్యాగ్‌తో దిగి పార్కింగ్ ప్లేస్‌లో వున్న తన కారు వద్దకు చేరుకునేసరికి సుచిత్ర అలసిపోతుంది. ఆ తర్వాత రష్‌లో, ట్రాఫిక్ జామ్స్‌తో, రెడ్‌లైట్, గ్రీన్ లైట్లలో టూ వీలర్లు, ఆటోలు, కార్లు, బస్సులు, లారీలు అన్నింటిని తప్పించుకుంటూ గమ్యం చేరేసరికి సుచిత్ర పూర్తిగా

అలసిపోతుంది. ఇక ఆఫీసులో అడుగుపెట్టిందగ్గర్నుంచి పని! పని! బాస్ పిలుపులు. సలహాలు, డిమాండ్స్ వాటితో సుచిత్రకు భోజనం చేసే టైము వుండదు. రాజు తన ఇంటి పనిలో, పాప బాధ్యతల్లో కొంత పాలుపంచుకుంటే, ఎంత బాగుండును– సుచిత్ర మనస్సులో రోజుకెన్నోసార్లు పడి లేచే కోరిక. అది తీరే కోరికేనా! దేనిలోనూ రాజు ఎప్పుడూ సాయపడేవాడుకాడు.

ఓ రోజు సుచిత్ర పొద్దున హడావిడిగా స్నానానికి పోతూ–

"రాజూ! కొంచెం ఆ కప్పులన్నీ తీసి సింక్‌లో పెట్టెయ్యవా!" అంది. అంతే రాజు కస్సున లేచాడు.

"ఆ పని పనిమనిసిది. నాకిప్పటికే ఆలస్యమైంది"

"అక్కడే ఉంటే ఈగలు..." ముక్కు విరిచింది సుచిత్ర.

"ఈగల్లేవు, దోమల్లేవు. అట్లయితే నువ్వు తీసిపెట్టు. నాకు టైం లేదు" సర్రున వెళ్ళిపోయాడు రాజు.

'ఎందుకీ రోజు గతమంతా ఇట్లా గుర్తుకువస్తున్నది!' అనుకొని ఆలోచనలు కట్టి పెట్టి నిట్టూర్చింది సుచిత్ర. పనులన్నీ చేసుకొని, పాపను క్రెష్‌లో వదిలేసి ఆఫీసుకు పది నిమిషాలు ఆలస్యంగా చేరుకుంది సుచిత్ర. ఎవరి కంట పడకుండా తన సీటు దగ్గరకు పోయి కూర్చుంది.

అన్ని పనులు ఒక ఎత్తయితే హెవీ ట్రాఫిక్ జామ్‌లో డ్రైవ్ చేయటం ఒక ఎత్తు! సుచిత్రకు నీరసం వచ్చినట్లనిపించింది.

ఆ రోజు సాయంత్రం సుచిత్ర పాపను క్రెష్‌లో నుంచి తీసుకొని ట్రాఫిక్ జామ్స్‌నుంచి డ్రైవ్ చేసుకుంటూ ఇల్లు చేరుకునేసరికి బాగా పొద్దుపోయింది. పని మనిషి వచ్చి అన్నీ సర్ది ఊడ్చి తుడ్చి వెళ్ళిపోయింది. దాని దగ్గర ఫ్లాటు తాళం చెవి ఒకటుంది. దాంతో పని మనిషి మధ్యాహ్నం వచ్చి తీరికగా అన్ని పనులు చేసుకొని వెళ్ళిపోతుంది.

సుచిత్ర పాపకు స్నానం చేయించి పాలు పట్టింది. వెంటనే పాప గాఢ నిద్రలోకి వెళ్లిపోయింది. అప్పుడు సుచిత్ర ఒక కప్పు టీ చేసుకొని కుర్చీలో కూర్చుంది. మెల్లగా టీ తాగుతూ అలసట పోగొట్టుకుంటోంది. 'ఇంకా వంట చెయ్యాలె!' ఆ ఆలోచనతో నిట్టూర్చింది. ఇంతలో రాజు లోపలికి వచ్చాడు. సుచిత్రను చూసి–

"ఏయ్ నాకు చాయ్ ఇచ్చేది ఉందా లేదా?" నవ్వు తెచ్చి పెట్టుకున్నట్లుగా ఉంది అతని గొంతు.

ఇంతకు ముందు మాట మాటకు, ప్రతి వాక్యానికీ "సుచ్చీ సుచ్చీ" అనేవాడు ప్రేమగా. ఇప్పుడా పిలుపే మరచిపోయాడు.

"పాలు ఫ్రిజ్‌లో ఉన్నాయి. డికాక్షన్ పెట్టుకో." సుచిత్ర అలసటగా అంది.

"ఉండనీ, అక్కర్లేదు. నేను పోతున్నా రాత్రి లేటవుతుంది" రాజు మాటలకు సుచిత్ర షాకయింది. ఏం మాట్లాడలేదు. రాజు బెడ్రూమ్‌లోకి పోయి ఫ్రెష్ అయి బట్టలు మార్చుకొని హాల్లోకి వచ్చాడు.

"హూఁ! ఇందుకోసమే ఇంటికి వచ్చాడేమో" అనుకుంది సుచిత్ర మనస్సులో.

"పార్టీనా?..." అడిగింది. రాజు మాట్లాడలేదు. సూట్ వేసుకున్నాడు. కోటు ఇంకా చేతిమీదే ఉంది. మరో చేత్తో షర్టును ప్యాంటులో దోపుకుంటూ వేగంగా తలుపువైపు అడుగులు వేశాడు.

"ఏమిటీ అర్ధరాత్రి వరకు పార్టీలు... నేనొక్కతెనే పాపతో..." సుచిత్ర కళ్లల్లో నీళ్లు నిండాయి. గొంతులో నిస్సహాయత. రాజు ఆగి వెనకకు తిరిగాడు.

"ఏం భయమా? పాప ఉంది గదా తోడుగా..." అన్నాడు.

"పాప నాకు తోడా? ఆఫీసునుంచి పోయి క్రెష్ నుంచి నేనే పాపను తెచ్చాను. పాపకు పాలు పట్టటం, స్నానం, డయపర్లు మార్చటం, ఏడిస్తే ఎత్తుకోవటం, డాక్టర్లు మందులు... అన్నీ నేనే చూసుకుంటున్నాను. నువ్వు సాయం చేయొచ్చు కదా. అంటే ఆఫీసులో చాలా పనులు అంటావు. నాకు ఆఫీసులో పనుల్లేవా?..." సుచిత్రకు దుఃఖం ఉప్పొంగుతున్నది. అణచుకుంది. బరువుగా అంది ఆ మాటలు.

"రాజూ! ఈ రోజు మా బాస్ యాడ్ ఫిల్మ్ ఎట్లా వచ్చిందో చూడాలన్నాడు. పాపను క్రెష్ నుంచి తేవాలని ఎట్లాగో తప్పించుకొని బయటపడ్డాను. తెలుసా!"

"అదే గద ఆడవాళ్లకున్న సౌకర్యం. ఎట్లనో అట్ల తప్పించుకొని పిల్లలు, చుట్టాలు, ఇల్లు, సంసారం అంటూ బయట పడ్తారు. రాత్రి డ్యూటీలుగాని, పార్టీలు గాని అటెండు కారు. మాకట్లా వీలు కాదే!" రాజు గొంతులో వ్యంగ్యం. సుచిత్ర స్టన్ అయింది.

"అదేంటి! నేనొక్కసారి రాత్రి ఆఫీసు పార్టీకి పోతే లొల్లి పెట్టినవు గుర్తుందా? అప్పట్నుంచి ఏదో వంకపెట్టి పార్టీలు మానుకున్నాను. అఫీషియల్ పార్టీలకు రావటం లేదని క్లయింట్స్ బ్యాడ్ ఇంప్రెషన్ పాలవుతున్నానని మా బాస్ మొత్తుకున్నాడు. దాంతో నా అసిస్టెంట్ రమేష్‌కు ఇంపార్టెన్స్ పెరిగింది. అదెంత దెబ్బ నా కెరియర్‌కు! బాధగా ఉంది సుచిత్ర గొంతు. ఏడుపొక్కటే తక్కువ. కాని సుచిత్ర అందరి ఆడవాళ్ళలాగా ఏడ్వకూడదని ఏడ్పు నాపుకుంది.

'తను ఎన్నో పుస్తకాలు చదివి తయారుచేసుకున్న నోట్స్‌లను తీసుకొని ఎక్కించుకున్న రాజేనా ఇతడు. అప్పుడు తన తెలివితేటలు, పనీ క్రమశిక్షణ గురించి ఎంత పొగిడేవాడు! ఆ పొగడ్తలతోనే తన మనస్సును గెల్చుకున్నాడు.'

'జీతం కోసమే నా ఉద్యోగం కానీ, నా సృజనాత్మకత ఏమైపోయినా ఫర్వాలేదతనికి!' గుండెలో బాధ నిండిపోయింది సుచిత్రకు. ఆ రోజు రాత్రి అశాంతిగా ఉంది. రెస్టాల్ వేసుకుని పడుకుంది. రాత్రి రాజు లేటుగా వచ్చి గెస్ట్ రూమ్‌లోనే పడుకున్నాడు. పొద్దున సుచిత్ర పాపకు పాలు పడ్తోంది. రాజు వచ్చి సుచిత్ర వెనుక నిలబడ్డాడు. సుచిత్ర వెనుకకు తిరిగి చూడలేదు. మాట్లాడలేదు.

"ఏం కోపమా? రాత్రి మా బాస్ సుపీరియర్ ఢిల్లీ నుంచి వచ్చాడు. చాలా మంచి పార్టీ. హోటల్లో చాలా లేటయింది" రాజు సుచిత్రకు దగ్గరగా వచ్చి భుజం మీద చేయి వేశాడు. చాలా రోజులకు అతని స్పర్శ! చలించిపోయింది. ఆమె అతన్ని క్షమించే మూడ్‌లోకి వచ్చింది.

"లేటయింది కదా. నిన్ను డిస్టర్బ్ చేయటమెందుకని గెస్ట్ రూమ్‌లోనే పడుకున్నా" చాలా రోజుల తర్వాత రాజు గొంతులో క్షమాపణ ధ్వనించింది.

"ఓ! ఎందుకింత సమర్థింపులు!" సుచిత్ర గొంతులోని మార్దవ్యాన్ని రాజు గుర్తించలేదు.

"సమర్థింపులా? నిజం చెప్తే సమర్థింపులంటావ్!"

తాచుపాములా లేచాడు రాజు. సుచిత్ర మంచి మూడ్ మాయమైంది. అతని హటాత్ అకారణ కోపానికి బిత్తరపోయింది.

నా దగ్గర తప్పుల్లేకుండా ఇంగ్లీషు మాట్లాడటం నేర్చుకున్న పల్లెటూరి రాజేనా ఇతడు! సుచిత్ర ఆశ్చర్యపోయింది మనస్సులో.

"అదిగాదు రాజు.. పాపతో ఎంతో పని. పైగా ఇంటిపని ఆఫీసు పని..." పూర్తి చేయకముందే సుచిత్ర మీద అరిచాడు రాజు.

"ఆ పనులన్నీ నిన్నెవరు చేయమన్నారు? పనిమనిషి ఆ పనులన్నీ చూసుకుంటుంది"

"ఆఁ... పని మనిషి వచ్చిందాక పాప పాల సీసా కడగటం, పాలు తాపటం ఆగుతాయా? రోజంతా నన్ను మిస్ చేసిన పాప సాయంత్రం ఏడుస్తుంటుంది. రాత్రి పాలు తాపటం, డయపర్లు మార్చటం ఇవన్నీ పనిమనిషి చూసుకుంటుందా? డ్రైవ్ చేస్తూ రష్‌లో, పాపను క్రష్‌లో వదలటం, తేవటం – ఇవన్నీ పనిమనిషి చేస్తుందా?" ఆవేశంగా అరిచింది సుచిత్ర.

"ఆ పనులు కొన్నైనా చెప్తే నేను చేసేవాణ్ని కదా!" కొంచెం కోపం తగ్గించి అన్నాడు రాజు...!

"చెప్తే! – ఎన్నని చెప్పాలె. అయినా చెప్తే నీకు చిరాకు! ఏమిటీ ఆడవాళ్ళ పనులన్నీ నన్ను చేయమంటావా? అని ఎగురుతావు..." సుచిత్ర మాటలు పూర్తికాకముందే రాజు అసహనంగా ఆమెనాపాడు.

"సరే ఇవన్నీ తర్వాత మాట్లాడుకుందాం. మా బాస్ సుపీరియర్ పొద్దున్నే ఏడుగంటల ప్లేన్‌లో ఢిల్లీ పోతున్నాడు. నేను ఎయిర్‌పోర్టుకు పోవాలె, సెండాఫ్ చెప్పటానికి" రాజు వేగంగా అక్కడ్నుంచి కదిలాడు. సుచిత్ర పాప నెత్తుకుని అతన్ని అనుసరించింది. "నీ ఆఫీసు. నీ బాస్, నీ పని... ఇదేనా నీ జీవితం. పాపనెవరు చూసుకోవాలె. ఒక్కసారన్నా పాపను ఈ మూడు నెలల్లో ఎత్తుకొని లాలించావా? పాలు తాగించావా? రాత్రుల్లో మేల్కొని డయపర్లు మార్చావా?..." సుచిత్ర అరిచింది.

"అవన్నీ ఆడోళ్ళ పనులు. ఆడంగి పనులు నేను చేయను" దృఢంగా వుంది రాజు గొంతు. ఆడంగి పనులని అననే అన్నాడు! సుచిత్ర కోపం మరింత పెరిగింది. అసహనంతో ఊగిపోయింది.

"వాట్ డూ యూ మీన్ – ఆడంగి పనులు! ఇద్దరం అనుకునే కదా పాపను ఈ లోకంలోకి తెచ్చాం. పాపను కన్నప్పుడు పాప బాధ్యత నీకు లేదా?"

"నేను మగాడిని. నేను బయటి పని చేస్తాను. నువ్వు ఇంటి పనులు చూసుకో!" నిర్లక్ష్యంగా ఉంది రాజు గొంతు.

"కాలేజీలో నా నోట్స్‌లు తీసుకొని రాసుకున్నపుడు నువ్విట్లా అన్లేదే! ఇద్దరం ఉద్యోగాలు చేద్దాం అన్నావు! మనకేం తక్కువ అన్నావు! నాకంటే నువ్వు బ్రైట్! నీకు

ముందుగా ఉద్యోగం దొరుకుతుంది అన్నావు. సంతోషించావు! ఏమేమో సమానత్వం, స్వేచ్ఛ అంటూ లెక్చర్లు దంచావు. అవన్నీ ఏమయ్యాయి? ఇప్పుడీ దర్టీ మైండ్ ఎక్కడ్నుంచి వచ్చింది?..." సుచిత్ర అరుస్తూ ఒక చేతితో పాపను గుండెకు అదుముకొని మరో చేతితో రాజు షర్ట్ కాలర్ పట్టుకుంది గట్టిగా. రాజు గుడ్లురిమి చూశాడు. సుచిత్ర చెంపమీద గట్టిగా అరచేతితో చరిచాడు.

"నా కాలర్ విడువు! ఎంత ధైర్యం నీకు!" రాజు అరచి సుచిత్రను పాపతో తోసేసి గబగబ బయటికి వెళ్ళిపోయాడు. సుచిత్ర స్థాణువులా నిలుచుండిపోయింది. కొంచెంసేపటికి తేరుకుంది. ఏడ్చే పాపను నిశ్శబ్దంగా వీపు తడుతూ ఊరడించింది. 'పాప పనులు చూసుకోవాలె! ఆఫీసు టైమ్ అయితోంది' అనుకుంది సుచిత్ర కోపం, ఏడ్పు అణచుకుంటూ.

పాపకు స్నానం చేయించాలె! తను స్నానం చేయాలె... బాత్రూమ్ వైపుకు కదిలింది సుచిత్ర. ఆ రోజు ఆఫీసులో మస్తు పనులు. ఆలస్యంగా పోతే బాస్ చురచుర చూస్తాడు. ఏ పనీ చేయలేదని ఏదో వంకతో అరుస్తాడు. పాపను క్రష్‌లో విడిచి పెట్టి తను ఆఫీసుకు పరిగెత్తాలె! పాప పాలు, నీళ్ళు, దయపర్లు అన్ని బుట్టలో సర్దుకోవాలె!... జల్దీ జల్దీ కానియాలె... పోనీ... తను ఉద్యోగాన్ని వదిలేస్తే... రాజీనామా ఇచ్చేస్తే... దాంతో తన సమస్యలు తీరుతాయా? ఎందుకు రాజు అంత అన్ కోపరేటివ్? కొంచెం సాయం చేయొచ్చు కదా! ఆడంగి పనులంటూ ఎందుకంత ఇగో... మేల్ షావనిజం!... పాపను... పాప పనులను అసలే పట్టించుకోడు! అతనికెప్పుడూ తన పని, తన ఆఫీసు... బాస్...! అవే కావాలె. తన డెలిగేషన్లు, తన డిన్నర్ పార్టీలు, తన ప్రమోషన్లు... ఇవే ఆలోచనలు! ఆలస్యంగా రావటం... గెస్ట్ రూమ్‌లో పడుకోవటం! అసలు పాప పుట్టిన దగ్గర్నుంచి తన దగ్గరికి రావటమే మానేశాడు. పాపను కన్నాననన్న నెపంతో తనను తాకటమే లేదు... అందుకే గద ఈరోజు అతని స్పర్శకు తను పులకించింది. మెత్తబడింది. అయినా గ్రహించలేదు. అదే దురుసుతనం!... తెల్లవారి లేచింది మొదలు పరుగులు! తను ఒక్కతే పాపను చూసుకోవటం!... పనిమనిషిని చేయమను... అంటాడు. పనిమనిషి ఏం చేస్తుంది! రాత్రి పక్కలో ఉండి పాలు పట్టదుగదా! దయపర్లు మార్చదు గదా! క్రష్‌కు తీసుకుపోయి తీసుకురాదు గద! పనిమనిషి ఎంత సాయం చేసినా రాజు పక్కన ఉండి... తోడుగా ఉండి సాయం చేసినట్లుగా ఉంటుందా? ఎందుకర్థం చేసుకోడు రాజు?... సుచిత్ర మనస్సులో ఆలోచనల హోరు! చెవుల్లో ఎవరో అరుస్తున్నట్లుగా గోల. మెదడులో రైళ్ళు పరిగెత్తుతున్న చప్పుడులు!

ఆమెకు చాలా బలహీనంగా అనిపించింది. తలంతా తాళ్లతో కట్టేసినట్లుగా ఉంది. కడుపులో తిప్పుతున్నట్లనిపించింది. చచ్చిపోతే బాగుండును - హఠాత్తుగా ఆలోచన మెరిసింది. ఆ ఆలోచన ఏదో శాంతిని కలిగించింది. కాని వెంటనే మళ్లీ కడుపులో మెలికలు! తిప్పుతోంది. తలకాయ బిగుసుకుపోతోంది!

చేతిలో ఉన్న పాప క్యార్‌మని ఏడ్పు... బాత్రూమ్‌లోకి నడిచింది సుచిత్ర. పాపకు స్నానం చేయించాలె. తరువాత తను తయారు కావాలె... తర్వాత ఆఫీసుకు... ఆఫీసులో

బోలెడు పనులు... ఫ్లాటంతా నిశ్శబ్దంగా ఉంది. కాని ఎక్కడో బోర్ వేస్తున్నట్లుగా గుయ్యిమని బర్రుమని సుచిత్ర చెవుల్లో ధ్వనులు నిరంతరంగా వినిపిస్తున్నాయి! పాపను ప్లాస్టిక్ టబ్‌లో కూర్చుండబెట్టి చేతితో పట్టుకుంది. మరో చేతితో సబ్బు రాసింది. నల్లా కింద టబ్! గోరు వెచ్చని నీళ్ళు టబ్‌లో నిండుతున్నాయి. టబ్‌లో నీళ్లు... నీళ్లు... పాప ముక్కు కళ్లు, తల మునిగే వరకు టబ్‌లో పడుతున్నాయి... పడుతున్నాయి. సుచిత్ర పాపను గట్టిగా పట్టుకుంది. వదలలేదు. కాని టబ్‌లో నీళ్ళు నిండుతున్నాయి. నిండుతున్నాయి! వెళ్ళిపో! చచ్చిపో... చచ్చిపో... సుచిత్ర చెవుల్లో ఎవరో అరుస్తున్నారు! మెదడులో ఒకటే కేకలు విన్పిస్తున్నాయి! అంతే... సుచిత్ర చేతులు పాపను వదిలేశాయి. పాప టబ్‌లో పడిపోయింది. నీళ్ళల్లో మునిగిపోయింది... సబ్బు నురుగు... బుజబుజమని నీళ్ళ బుడగలు... పాప జారిపోయింది... మునిగి పోయింది! బాత్రూమ్‌లో నుంచి నీళ్ళు బయటికి పారాయి. ఫ్లాటంతా నిండాయి... బయటికి ప్రవహించాయి... ఫ్లాటులోనుంచి బయటికి... మెట్ల మీదినుంచి కిందికి... కాలువలుగా... ధారలుగా నీళ్ళు!

నీళ్ళు! నీళ్ళు!... ఎక్కడివి? – మాటలు... గోల... లొల్లి... వాచ్‌మ్యాన్ గొంతు... పానీ కహాసే ఆ రహా హై?... అరుపులు ఎవరో దబదబ నడిచిన ధ్వనులు! ఎక్కడ్నుంచో దూరంగా తలుపులు బలవంతంగా తోసిన శబ్దాలు!... మనుషులు గుంపులు గుంపులుగా లోపలికి జొరబడిన కాళ్ళ చప్పుళ్ళు... "బాప్‌రే! బచ్చీ మర్‌గయీ! మాఁ యఁహీఁ హై!..." వాచ్‌మ్యాన్ మాటలు సుచిత్రకు ఎక్కడ్నుంచో వినబడ్తున్నాయి.

ఎవరు బచ్చీ!... ఎవరా పిల్ల!... ఎవరా పాప!... ఎవరు?... ఎవరు?... సుచిత్ర మొద్దుబారిన మెదడులో ఎక్కడో గుసగుసగా మాటలు!... ప్రశ్నలు!... అంతా చీకటి... అంధకారం!... కిలకిలా నవ్వులు! వెంటనే నిశ్శబ్దం!... అంతే!... ఎంత సుఖంగా వుంది!...

నీళ్ళలో మునిగిన ప్రాణంలేని పాపను చేతులతో గట్టిగా పట్టుకుంది సుచిత్ర. వచ్చినవాళ్ళు గుంపులు గుంపులుగా ఫ్లాట్‌లో... వాళ్ళతో పోలీసులు చేరారు. ఎప్పుడో కొయ్యబారిన సుచిత్రను లేవదీసి మెంటల్ హాస్పిటల్ నుంచి వచ్చిన వ్యాన్‌లోకి ఎక్కించారు. సుచిత్ర గాజుకళ్ళతో అందరి వైపు చూసింది. కాని ఆమె కేమీ అర్థం కాలేదు. రాజు...? అనుకుంది. కాని ఎదురుగా ఉన్న రాజునూ గుర్తుపట్టలేదు. రాజు ముఖంమీద ఏ నేర భావన లేదు. మగవాడి స్వార్థంతో, అహంభావంతో స్త్రీ శరీరం మనస్సు ఎంత ధ్వంసమైపోతున్నాయో అక్కడున్న వాళ్ళకెవరికీ అర్థమైనట్లు లేదు. ఆమె ముఖం మీద ఏ భావం లేదు. ఎక్కడికి పోతున్నదో తెలియదు. వ్యాన్ వెనుక సీట్లో ఒక్కతే కూర్చుంది. కదిలే ప్రయత్నమూ చేయలేదు. అందరివైపు చూసింది. కాని ఎవర్నీ ఆమె గుర్తించలేదు. వ్యాన్ వేగంగా కదిలింది మెంటల్ దవాఖానా వైపు!

"విపుల" మాసపత్రిక మార్చి, **2008**